పార్టీ కోసం పని చేసేవారికి ప్రాధాన్యం

- కార్యకర్తలకు గుర్తింపు తీసుకొచ్చే బాధ్యత నాది
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- మహిళా నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన మహిళా నాయకులు, కార్యకర్తలు

గాజువాక: గాజువాక ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కార్యకర్తలకు గుర్తింపు తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహిళా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కొందరికి పదవులు రావచ్చు.. మరికొందరికి రాకపోవచ్చు.. అయితే, పదవులు ఉన్నా, లేకపోయినా ఈ ప్రాంతం కోసం, పార్టీ కోసం పని చేసిన వారు ఉన్నారన్నారు. 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో రాజకీయాలు చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కారకులు కూడా ఈ నియోజకవర్గంలోనే ఎక్కువ మంది ఉన్నారన్నారు. పార్టీలో జెండా పట్టుకొని పని చేసే ప్రతి ఒక్కరూ పదవులు ఆశించడంలో తప్పు లేదన్నారు. ఆయా పదవులు కొంతమందికి ముందు, కొంతమందికి ఆలస్యంగా వస్తాయన్నారు. 2001లో తన తండ్రి గురునాథరావు మరణించిన తరువాత ఎదగడానికి తనకు 18 ఏళ్లు పట్టిందని, రాజకీయాల్లో ఎదగాలనుకున్న వారికి ఓర్పు, సహనం అవసరమని అన్నారు.

జగన్ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పథకాలన్నీ మహిళల పేరుతోనే ఇచ్చారన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత రాష్ట్రాన్ని ఏలిన ఏ ప్రభుత్వం చేయలేని విధంగా రెండు లక్షల 75వేల కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను పేద, బడుగు, బలహీనవర్గాలకు, మహిళలకు అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పథకాలు తీసుకున్న మహిళలు ఈ ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి ఓట్లు వేసేలా చూసే బాధ్యత మహిళా నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పథకాలతో ఆర్థికంగా ఎదిగిన 70 శాతం మంది మహిళలు మళ్లీ ఆయనకే ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వివిధ కార్పొరేషన్లకు చైర్మన్, డైరెక్టర్ల పదవుల్లో 50 శాతం మహిళలకే ఇచ్చారన్నారు.

17న గాజువాక మేనిఫెస్టో విడుదల

ఈ నెల 17న గాజువాక నియోజకవర్గ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్టు అమర్‌నాథ్ తెలిపారు. నియోజకవర్గ ప్రజల అభిమతాలకనుగుణంగా మేనిఫెస్టోను రూపొందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలతో మహిళలంతా సంతృప్తిగా ఉన్నారని, వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వస్తేనే మళ్లీ పథకాలు కొనసాగుతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ గాజువాకలో గుడివాడ కుటుంబీకులకు మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకూటి రామచంద్రరావు, భూపతిరాజు సుజాత, ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, సీనియర్ నాయకుడు రొంగలి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, నాయకులు ఈగలపాటి యువశ్రీ, ప్రమీల, నిర్మలా రెడ్డి, గంగాభవాని, కల్పన, శిరీష, రోజారాణి, మీరా, స్వాతిరెడ్డి, రామలక్ష్మి, విమలాథామస్, సూర్య, అన్నపూర్ణ, లక్ష్మి, కె.లక్ష్మి, రమాదేవి, ధనాల ఉమ, సంతోషి, మౌనిక, బేగం, సత్యవతి, పి.లక్ష్మి, స్వాతి కుమారి, దుర్గమ్మ, రాజువరలక్ష్మి, ఒమ్మి ఈశ్వరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న అమర్‌నాథ్ తదితరులు

గాజువాక నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో సమస్యలను, అవసరాలను తెలుసుకొనేందుకు వీలుగా మంత్రి అమర్‌నాథ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. పార్టీ పెద్దలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, తిప్పల దేవన్ రెడ్డి, ఉరుకూటి అప్పారావు సమక్షంలో https://www. gudivadafor gajuwaka.com ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ ద్వారా గాజువాక నియోజకవర్గ ప్రజలు నియోజకవర్గ అభివృద్ధిపై ఈ నెల 16లోగా అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. 07314599858 నంబర్ వాట్సాప్ ద్వారా కూడా ప్రజలు తమ సూచనలను తెలియజేయవచ్చన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్, నౌవాస్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సంబంధిత ప్రాంతాల్లో ఈ నెల 12న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టింపనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, ఆదర్శ గౌండ్ ఏరియాతో పాటు నౌవాస్ 11కేవీ ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ ఫేజ్–2, నౌవాస్ ఏబీసీ బ్లాక్స్, పోర్టు రోడ్డు ఏరియా, జీవీఎంసీ డంపింగ్ యార్డ్ ఏరియా, భరత్‌నగర్, అమరావతినగర్ ఏరియాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రూరల్ పరిధిలో..

11కేవీ గాజువాక ఫీడర్ పరిధిలోని వికాస్‌నగర్, బీసీ రోడ్డు, భవానీ నగర్, ప్రియదర్శిని కాలనీ, వాంబే కాలనీ, బాపూజీ కాలనీ, సంజీవ కాలనీ, నేతాజీ కాలనీ, కొత్త దిబ్బపాలెం, యాతపాలెం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

23న బొర్రమాంబ జాతర



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీల ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి, పరిసర అష్ట గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి జాతరను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ, ఉత్సవ కమిటీలు వెల్లడించాయి. ఈ సందర్భంగా బొర్రమాంబ వనం వద్ద ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో అమ్మవారి ఉత్సవాల వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అతిపెద్ద పండగ కావడంతో కమిటీ, ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. 11వ తేదీన దుర్గాలమ్మ, 16వ తేదీన పరదేశమ్మ జాతరలు, 18న అమ్మవారి పుట్ట బంగారు ఉత్సవం, 22న తొలేళ్ల మహోత్సవం మరియు కోటి దీపోత్సవం, 23న అనుపు మహోత్సవం జరిపించేందుకు నిర్ణయించినట్టు తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు



డైరెక్టర్ గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) సిహెచ్.ఎస్.ఆర్.వి. గోపాలకృష్ణ గణేష్‌ను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు బుధవారం ఆయనను ఉక్కు పరిపాలన భవనంలో కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, దాలినాయుడు, జి.అప్పలరాజు, పిట్టా రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కాళ్ల అప్పారావు, ఎన్.టి.అప్పారావు, చంద్రశేఖర్, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణి హోమం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన క్షేత్రంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు శంఖు,చక్ర,గధా, పద్మ ధారియై నారాయణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. అనంతరం హోమ శాలలో మహాలక్ష్మీ సమేత నారాయణి హోమం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక క్రతువులు నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.

నేటి నుంచి సీడబ్ల్యూసీ-1లో ఉచిత హెల్త్ చెకప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ–1)లో గురువారం నుంచి ఉచిత హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం కార్యదర్శి డొక్కా నర్సింగరావు తెలిపారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని, నగరంలోని మాధవ్‌బాగ్ మల్టీ డిసిప్లినరీ కార్డియాక్ కేర్ క్లినిక్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ హెల్త్ చెకప్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న ఈ చెకప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సాహిత్య సుధ వార్షికోత్సవం



అవార్డు గ్రహీతలతో అద్దంకి రాఘవాచార్యులు

పెదగంట్యాడ: సాహిత్య సుధ 25వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ గాయత్రీదేవికి కవనశ్రీ బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు, డాక్టర్ సుధ, డాక్టర్ హేమలత, వీఎస్‌ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతాం



73వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

- వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- 73వ వార్డులోఎన్నికల ప్రచారం



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న అమర్‌నాథ్



మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో దేవన్ రెడ్డి

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె 73వ వార్డులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆగాలంటే వైఎస్సార్‌సీపీ రావాలన్నారు. పోరాట కమిటీకి సహకరిస్తున్నది వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు, ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్న పార్టీతో టీడీపీ, జనసేన కూటమి కట్టాయన్నారు. ఆ కూటమిని ఓడించాలని కోరారు. తాను ఈ ప్రాంత ఆడపడుచునని, ఇక్కడినుంచి పోటీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మళ్లీ గెలిపిస్తాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహా నాయకులందరూ తమకు అద్భుతంగా సహకరిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ కచ్చితంగా గెలుస్తుందని అన్నారు.

దీర్ఘకాల సమస్యల పరిష్కారం

గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గాజువాకలో అనేక సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కూడా వైఎస్సార్‌సీపీ పాలనలోనే పరిష్కారమయ్యాయన్నారు. నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు పీలా ఉమారాణి, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు వద్ద కార్మికుల ఆందోళన



గంగవరం పోర్టు వద్ద బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ: తమ డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టు కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. యాజమాన్య ప్రతినిధుల తీరును నిరసిస్తూ ధర్నా చేశారు. పోర్టు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న ముగ్గురు కార్మికులు ఇటీవల మృతి చెందారని చెప్పారు. అయితే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు మృత్యువాత పడితే వెంటనే రూ.25లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో నష్టపరిహారం కింద రూ.50లక్షలు ఇచ్చి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలన్నారు. లేనిపక్షంలో గంగవరం పోర్టును తరలించాలని, మా సముద్రాన్ని మాకు అప్పగించాలన్నారు. ఈ ఆందోళనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు పోలీసులు అక్కడికి చేరుకుని, కార్మికులతో చర్చించారు.

స్టీల్‌ప్లాంట్ కళాక్షేత్రాలకు ఆన్‌లైన్ అలాట్‌మెంట్

- ఆగస్టు నుంచి అమలు
- యాజమాన్యం ఉత్తర్వులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఆంధ్ర కేసరి, అంబేడ్కర్ కళాక్షేత్రాల ఆన్‌లైన్ అలాట్‌మెంట్‌కు యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ గురజాడ కళాక్షేత్రం మొదటి నుంచి ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అలాట్‌మెంట్ జరుగుతూ ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉంటోంది. అయితే అదే యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అంబేడ్కర్, ఆంధ్రకేసరి కళాక్షేత్రాలు కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు ఆయా గుర్తింపు సంఘాలకు చెందిన పాలకవర్గాల కమిటీల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. దీంతో కళాక్షేత్రాలు ఆయా కమిటీలు, కార్మిక సంఘాలకు కాసుల పంటగా మారింది. ఆ కమిటీల కార్యదర్శుల పోస్టులకు లక్షల రూపాయలు వేలం పాట జరిగేదన్న ఆరోపణలు వినిపించాయి. ఆ కాసుల గొడవే ఇటీవల ఆంధ్రకేసరి కళాక్షేత్రం నుంచి పోలీస్ స్టేషన్‌కు చేరిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితులను ఎన్నో ఏళ్లుగా చూస్తున్న యాజమాన్యం ప్రతినిధులు ఎట్టకేలకు ఈ కళాక్షేత్రాలకు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి గురజాడ కళాక్షేత్రంలా ఆన్‌లైన్ అలాట్‌మెంట్‌ను అమలు చేయనున్నారు.

8 మంది వలంటీర్ల రాజీనామా

సేవలు వద్దనడంతో మనస్తాపం



ఎడ్యుకేషన్ సెక్రటరీ గౌరీ శంకర్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



సచివాలయ అడ్మిన్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న వలంటీర్ గొంప రామజ్యోతి

పెదగంట్యాడ: మండలంలోని 8మంది వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ వ్యక్తిగత కారణాలు పేర్కొంటూ రాజీనామా పత్రాలను సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ గౌరీశంకర్‌కు సమర్పించారు. వారిలో పెదగంట్యాడ–2 సచివాలయానికి చెందిన 7గురు, వుడా ఫేజ్–2కి చెందిన ఒకరు ఉన్నారు. వారు మాట్లాడుతూ తాము నాలుగున్నరేళ్లగా గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా, నిస్వార్థంగా పేద ప్రజలకు సేవలు అందించామన్నారు. సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రభుత్వం సూచించిన ప్రతీ పనిని పార్టీలకతీతంగా చేశామన్నారు. కరోనా విపత్కర సమయంలోనూ అనారోగ్యంతో ఉన్న వారికి చికిత్స అందేలా బాధ్యతలు నెరవేర్చామన్నారు.. టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఆ పార్టీల నాయకులు తమను పలుమార్లు నిందించినా, దేశద్రోహులు, నేరగాళ్లు అంటూ అవమానించినా తమ సేవలు మానుకోలేదన్నారు. ప్రస్తుతం కోడ్‌కు విరుద్ధమంటూ తమను మరింత అవమానపరుస్తూ, సేవలు అందించరాదంటూ అధికారులు ఇచ్చిన ఆదేశాలు తమను మరింత బాధించాయని, తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేశామని తెలిపారు. ఎడ్యుకేషన్ సెక్రటరీ గౌరీ శంకర్ మాట్లాడుతూ రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

సేవలో సంతృప్తి పొందాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తగు అర్హతలతో ఇంట ర్వ్యూ చేసి మమ్మల్ని నియమించింది. నాటి నుంచి గౌరవ వేతనంతో, పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు ఇంటింటికి అందించాం. సేవలో సంతృప్తి పొందాం. ప్రతిపక్ష నాయకులు, ఇతరుల ఫిర్యాదులతో మేం సేవ చేయడానికి వీల్లేదంటూ తప్పించడంతో మనస్తాపంతో రాజీనామా చేశాను. – **వాకాడ అచ్యుత్‌రెడ్డి,** వలంటీర్, రామచంద్రనగర్

అవమానాలు దిగమింగి పనిచేశాం



వలంటీర్లు దేశద్రోహులు, నక్సలైట్లు, బ్రోకర్లంటూ.. చివరకు కుటుంబాలను నాశనం చేస్తున్నారంటూ టీడీపీ, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేసినా, అవమానాలు దిగమింగుతూ సేవలు కొనసాగించాం. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తూ అండగా నిలిచాం, నేడు మమ్మల్ని సేవలు చేయొద్దంటే మేము కొనసాగి, అర్థం ఏం ఉంటుంది. అందుకే రాజీనామా చేశాను. – **షావుకారి మాధురి,** వలంటీర్, రామచంద్రనగర్

చిరస్థాయిగా నిలిచేది సేవలే..



ఎస్‌ఎంఎస్-2లోని సత్కార సభలో ఉన్నతాధికారులు, సహోద్యోగులు

ఉక్కునగరం: నిజాయితీ, అంకితభావంతో సంస్థ అభివృద్ధి కోసం చేసే సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని స్టీల్‌ప్లాంట్ జీఎం (స్టీల్) ఇన్‌చార్జి శాంతను డే అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్–2 విభాగంలో డీజీఎంగా విధులు నిర్వహిస్తూ రాజీనామా చేసిన ఎస్. గోపీకృష్ణను విభాగంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపీకృష్ణ తాను సర్వీసు చేసిన అన్ని విభాగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఎస్‌ఎంఎస్–2 విభాగాధిపతి ఎస్.మండల్ మాట్లాడుతూ గోపీకృష్ణ విధి నిర్వహణలో అనేక ఆధునికీకరణ పనులు చేసి, అనేక పనులు సులువు చేశారన్నారు. వాటిని చూసిన ప్రతీసారి ఆయనే గుర్తు వస్తారన్నారు. విభాగం మెకానికల్ ఇన్‌చార్జి జయకుమార్, ఉక్కు భద్రతా విభాగం జీఎం ఎంఎస్ఎన్ రాజు, సహ అధికారులు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

‘ఉద్యమాలతో ప్రైవేటీకరణను అడ్డుకుంటాం’

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికులు తమ జీవితాల కోసం, దేశ సంపదను కాపాడడం కోసం చేస్తున్న పోరాటానికి కేంద్రప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమాలతో ప్రైవేటీకరణను అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1154వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్‌ఎంఎస్–2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కేంద్ర ప్రభు త్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మిత్రుడి పేరిట సేవాకార్యక్రమాలు అభినందనీయం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అగనంపూడి: మరణించిన మిత్రుని పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొశిరెడ్డి రమణారావు కుమారుడు గుణశేఖర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా అగనంపూడి సెక్టార్–1లో గుణమిత్ర మండలి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమర్‌నాథ్ వారి సేవలను కొనియాడారు. శిబిరంలో 36 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 150 మందికి ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి ఈసీజీ తీశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు గొలగాని శ్రీనివాసరావు సాలాపు అచ్చిబాబు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సూచించారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొననున్న గాజువాక నియోజకవర్గం పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు గాజువాక టీఎస్సార్, టీబీకే కళాశాలలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల విషయంలో తమకు అప్పగించిన బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించాలని, తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ మొదలుకుని ఎన్నికలు పూర్తయ్యే వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి పాల్గొన్నారు.

హానిమన్‌కు ఘన నివాళులు



హోమియో వైద్యురాలు కళావతిని సత్కరిస్తున్న నాయకులు



హానిమన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీదేవి, గ్రామ పెద్దలు

అగనంపూడి: పేదలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకే డాక్టర్ హానిమన్ హోమియో వైద్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని అగనంపూడి హోమియో వైద్యురాలు డాక్టర్ కళావతి అన్నారు. అంతర్జాతీయ హోమియో పతి దినోత్సవం సందర్భంగా హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ కళావతిని సత్కరించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కళావతి, స్టాఫ్ నర్స్ నాగమణి, ప్రజా సంఘాల నాయకులు హనుమంతురావు,సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిందిలో..

అక్కిరెడ్డిపాలెం: హోమియో ఫౌండర్ డాక్టర్ హానిమన్ జయంతిని మిందిలోని ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిలో నిర్వహించారు. హానిమన్ చిత్రపటానికి డాక్టర్ శ్రీదేవి నివాళులర్పించారు. గ్రామ పెద్దలు ఒ.వెంకట్రావు, ఈటి విజయశంకర రావు,గోలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.